సాక్షి సూర్యాపేట

ఆదివారం । 28 । మే । 2023



కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

ఎస్సీ, ఎస్టీ రిజర్వ్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యమని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రీతమ్ అన్నారు. - 8లో



మోతె ఎస్ఐని సస్పెండ్ చేయాలి

మోతె ఎస్ఐ మహేష్‌ను సస్పెండ్ చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ఆందోళన నిర్వహించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
43° / 27°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రజావాణి రద్దు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజావాణికి వచ్చే ప్రజల ఆరోగ్యం దృష్ట్యా సోమవారం నిర్వహించే ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలోని మున్సిపల్ పరిధిలో వివిధ వ్యాపార వర్గాలు, వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, సైన్ బోర్డుల ఏర్పాటుకు ముందస్తుగా మున్సిపల్ శాఖ అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ వెంకట్రావ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించే రీతిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు పెట్టిన వారికి ఇప్పటికే నోటీసులు జారీ చేశామని తెలిపారు. వారు మూడు రోజుల గడువులోపు వాటిని తొలగించాలని సూచించారు.

ఉద్యమకారులను సమర యోధులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న చక్రహరి రామరాజు

భానుపురి (సూర్యాపేట): 1969 తెలంగాణ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సమరయోధులుగా గుర్తించాలని 1969 తెలంగాణ ఉద్యమ కారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని కిరాణా ఫ్యాన్సీ మర్చంట్ అసోసియేషన్ భవనంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు తెలంగాణ ఉద్యమకారుల సంఘం సభ్యుడు నీలకంఠ చలమంద అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీతారాంరెడ్డి, జిల్లా కోశాధికారి చంద్రారెడ్డి వెంకటయ్య, దేవత్ కిషన్ నాయక్, కొత్త గురువయ్య, కత్తిరేణి వెంకటేశ్వర్లు, నాసిని నర్సింగరావు పాల్గొన్నారు.

గోదాం నిర్మాణ స్థల పరిశీలన



వల్లాపురంలో గోదాం నిర్మాణ స్థల పరిశీలనలో డీసీఓ శ్రీధర్ తదితరులు

నడిగూడెం: మండల పరిధిలోని వల్లాపురంలో నడిగూడెం సహకార సంఘం ఆధ్వర్యంలో గోదాం నిర్మించేందుకు కేటాయించిన స్థలాన్ని శనివారం డీసీఓ నామ శ్రీధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తనాల కోసం దూరం వెళ్లాల్సిన అవసరం లేదని, గోదాం నిర్మాణంతో రైతులకు ఇబ్బందులు తొలుగుతాయన్నారు. ఆయన వెంట నడిగూడెం సహకార సంఘం చైర్మన్ పుట్టా రమేష్, సర్పంచ్ వట్టికూటి చంద్రయ్య, ఉప సర్పంచ్ ప్రమీల, సహకార సంఘం డైరెక్టర్ వట్టికూటి వెంకన్న ఉన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని శనివారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం అష్టోత్తర, సహస్త్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచ గవ్యప్రాశన, మధుఫర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్ కుమార్, చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

● ముగిసిన బాస్కెట్‌బాల్ పోటీలు



సూర్యాపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్



బాలికల విభాగంలో మొదటి బహుమతి పొందిన మేడ్చల్ మల్కాజిగిరి జట్టు

మోతె పిచ్చిరెడ్డి పదవీకాలం పొడిగింపు



చైర్మన్ పిచ్చిరెడ్డికి ఉత్తర్వుల కాపీ అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్: ఉమ్మడి నల్లగొండ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి పదవీకాలాన్ని మరో రెండు సంవత్సరాలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కృత్రిమ గర్భధారణతో పాటు పాడి ఉత్పత్తి పెంపునకు చేస్తున్న కృషికి గాను ప్రభుత్వం ఆయన పదవీకాలాన్ని పొడిగించింది. ఈ మేరకు శనివారం నల్లగొండలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి చేతుల మీదుగా చైర్మన్ మోతె పిచ్చిరెడ్డికి ఉత్తర్వుల కాపీని అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పిచ్చిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పాడి ఉత్పత్తి పెంపునకు మరింతగా కృషి చేస్తానన్నారు.

ఓటరు నమోదుకు మరో అవకాశం

ఓటరు జాబితా సవరణకు ప్రత్యేక ప్రణాళిక విడుదల

- 25 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభించిన బీఎల్‌ఓలు
- వచ్చే నెల 23 నుంచి 31 వరకు పరిశీలన
- అక్టోబర్ 4న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్న అధికారులు



నాగారం: ఎన్నికల సంఘం ప్రతి సంవత్సరం ఓటరు జాబితా సవరణ షెడ్యూల్‌ను ప్రకటిస్తుంది. గత ఏడాది నవంబర్‌లో ముసాయిదా విడుదల చేయగా.. జనవరి 5న తుది ఓటరు జాబితా విడుదల చేసింది. ఈ ఏడాది ఎన్నికల సీజన్ కావడంతో రెండో సారి స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)–2023 ప్రణాళికను ప్రకటించింది. ఈ మేరకు ఈ నెల 25న బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే ప్రారంభించారు. జూన్– 23 నుంచి 31 వరకు పరిశీలన ఉంటుంది. ఆగస్టు 2న ముసాయిదా విడుదల చేసి, అదే నెల 31 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఈ మధ్యలో కొత్తగా ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులపై శని, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి, సెప్టెంబర్ 22న అభ్యంతరాలపై వివరణ ఇస్తారు. అక్టోబర్ 4న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు.

పోలింగ్ కేంద్రాల గుర్తింపు..

జూన్ 24 నుంచి జూలై 24 వరకు పోలింగ్ కేంద్రాలను గుర్తించి, వాటిల్లో సౌకర్యాలను పరిశీలిస్తారు. ఒక కేంద్రంలో 1,500 మంది ఓటర్లు ఉండేలా చూస్తున్నారు. అవసరం అనుకుంటే కొత్తవాటిని ప్రతిపాదిస్తారు. పాత కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేకుంటే దానికి సమీపంలోనే కొత్తవి గుర్తించాల్సి ఉంటుంది. అయితే ప్రతి కేంద్రాన్ని ఫొటో తీసి ఎన్నికల సంఘానికి నివేదించాలి.

కొత్త సాఫ్ట్‌వేర్..

ఎన్నికల సంఘం కొత్త సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఓటు నమోదు, మార్పులు, తొలగింపుల ప్రక్రియలకు ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ఈఆర్వోనెట్ 2.0ను వినియోగిస్తుంది. ప్రస్తుతం ఇందులోనే కొత్త ఓటర్ల దరఖాస్తులు నమోదు చేస్తున్నారు. ప్రతి ఒక్కరు వారి ఓటరు జాబితాను సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఏమైనా తప్పులు దొర్లితే తిరిగి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంటున్నారు.

జిల్లాలో 9,14,668 మంది ఓటర్లు

జిల్లాలో తాజా ఓటరు జాబితా ప్రకారం 9,14,668 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 4,52,396 పురుషులు, 4,62,250 మంది మహిళలు, 22 మంది ఇతరులు ఉన్నారు. హుజూర్‌నగర్‌లో 2,30,474, కోదాడలో 2,25,829, సూర్యాపేటలో 2,22,871, తుంగతుర్తిలో 2,35,494 మంది ఓటర్లు ఉన్నారు.

మార్గదర్శకాలపై అవగాహన కల్పిస్తాం



కొత్తగా ఓటరు జాబితా రూపొందించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఈమేరకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తున్నారు. కొత్తవారు ఉంటే వారి పేరు నమోదు చేస్తారు. ప్రతి ఒక్కరు వారి ఓటరు జాబితాను సరిచూసుకోవాలి. త్వరలోనే బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించి, మార్గదర్శకాలపై అవగాహన కల్పిస్తాం.

– శ్రీకాంత్, ఎన్నికల విభాగం డీటీ, తుంగతుర్తి నియోజకవర్గం

ఆయిల్ పామ్ సాగు ఎంతో ఉపయోగం

- కలెక్టర్ వెంకట్రావు



నామవరం గ్రామంలో ఆయిల్ పామ్ మొక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

మోతె: ఆయిల్ పామ్ సాగు రైతులకు ఎంతో ఉపయోగకరమని కలెక్టర్ వెంకట్రావు అన్నారు. శనివారం మోతె మండల పరిధిలోని నామవరం గ్రామ శివారులో గోవిందరెడ్డి అనే రైతు తన ఆరున్నర ఎకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్ పామ్ తోటలు సాగు చేసేందుకు భూమి, వాతావరణం అనుకూలంగా ఉందని తెలిపారు. మాధవరం, చిల్పకుంట్ల గ్రామాల్లో సుమారుగా ఆరు లక్షల ఆయిల్ పామ్ మొక్కలు పెంచడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారులు, వాణిజ్య శాఖ అధికారులు ఉన్నారు.

తల్లిదండ్రులకు ఆసరాగా నిలవాలి



వివేకానంద వృద్ధాశ్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి



సూర్యాపేట సబ్ జైలులో వంటలను పరిశీలిస్తున్న జడ్జి

- సూర్యాపేట జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి

చివ్వెంల(సూర్యాపేట): అవసాన దశలో తల్లిదండ్రులకు పిల్లలు ఆసరాగా నిలవాలని సూర్యాపేట జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవా అథారిటీ సంస్థ కార్యదర్శి శ్రీవాణి అన్నారు. శనివారం మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామ శివారులో ఉన్న వివేకానంద వృద్ధాశ్రమాన్ని ఆమె సందర్శించారు. ఈసందర్భంగా వృద్ధుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వారికి అందుతున్న ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి గ్లాసులు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఆమె వెంట జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి పోలేబోయిన నర్సయ్య యాదవ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన జడ్జి

సూర్యాపేట జిల్లా సబ్ జైలును సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందుతున్న మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. క్షణికావేశంలో తప్పులు చేసి జైలు పాలు కాకూడదని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు శశిదర్, వసంత సత్యనారాయణ పిళ్లే యాదవ్, కోక రంజిత్ కుమార్, బొల్లెద్దు వెంకటరత్నం, మారపాక వెంకన్న, ప్రకాశ్, వాణి, వీరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సర్దుబాటుకు కసరత్తు

- వివరాల సేకరణలో అధికారులు
- విద్యార్హతల ఆధారంగా సర్దుబాటు
- జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 446 మంది వీఆర్‌ఏలు



చిలుకూరు: జిల్లాలో గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ)ను క్రమబద్ధీకరించేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు ఆయా మండలాల్లో తహసీల్దార్లు గ్రామాల వారీగా వీఆర్‌ఏల వివరాలను సేకరిస్తున్నారు. విద్యార్హతల ఆధారంగా నీటి పారుదల, వ్యవసాయ, పురపాలక, విద్యా, రెవెన్యూ, మిషన్ భగీరథ, జిల్లా పరిషత్, వైద్య కళాశాలల్లో సర్దుబాటు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

మూడు కేటగిరీలుగా..

గ్రామ రెవెన్యూ సహాయకుల్లో ఉన్నత విద్యార్హతలున్న వారికి పదోన్నతులు కల్పిస్తామని, 55 ఏళ్లు నిండిన వారి పిల్లలకు వారసత్వ ఉద్యోగాలు ఇస్తామని సీఎం హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రెవెన్యూ యంత్రాంగం గ్రామాల వారీగా వీఆర్‌ఏల సమగ్ర సమాచారాన్ని సేకరిస్తోంది.

- మొదటి కేటగిరీ కింద పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష ద్వారా నియామకమైన వీఆర్‌ఏల వివరాలను ప్రత్యేకంగా నిర్దేశించిన ఫార్మాట్‌లో నమోదు చేస్తున్నారు. ప్రస్తుతం వీరు నిర్వహిస్తున్న విధులు, విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలను సేకరిస్తున్నారు.
- రెండో కేటగిరీ కింద 2023 మే 15 నాటికి వయసు, విద్యార్హత, నియామకమైన విధానాన్ని సేకరించడంతో పాటు అందుకు అవసరమైన ధ్రువపత్రాలు తీసుకుంటున్నారు.
- మూడో కేటగిరీ కింద అనారోగ్యంతో ఉన్న వారి వివరాలను ప్రత్యేకంగా నమోదు చేస్తున్నారు. సంబంధిత వ్యక్తులకు బదులుగా పనిచేస్తున్న వ్యక్తికి ఉన్న సంబంధాన్ని నమోదు చేస్తున్నారు.

నియామక పత్రాలు అందుబాటులో లేకపోవడంతో

జిల్లా వ్యాప్తంగా 23 మండలాల్లో 475 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిల్లో వీఆర్‌ఏల పోస్టులు 560 కాగా 446 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఖాళీలు 114 ఉన్నాయి. విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఏల్లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుంచి నియామకమైన వీఆర్‌ఏలు 122 మంది, కారుణ్య, వారసత్వ నియామకం కింద ఉన్న వీఆర్‌ఏలు 324 మంది ఉన్నారు. అందులో మెజారిటీ వీఆర్‌ఏలకు సంబంధించి నియామక పత్రాలు అందుబాటులో లేకపోవడం సమస్యగా మారింది. దీంతో అక్రమాలు జరిగే అవకాశం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

రెవెన్యూ శాఖలో కొనసాగేందుకు..

మెజారిటీ వీఆర్‌ఏలు రెవెన్యూ శాఖలో కొనసాగేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. విద్యార్హతలను బట్టి కొందరు వీఆర్‌ఏలను తహసీల్దార్ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్‌లుగా నియమించేందుకు కసరత్తు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. రెవెన్యూ పరిశీలకులు (ఆర్ఐ) లకు సహాయకులుగా ముగ్గురు నుంచి నలుగురు వీఆర్‌ఏలను నియమించే ప్రతిపాదన ఉన్నట్లుగా తెలిసింది. ఈ నేపథ్యంలో విద్యార్హతలున్న పలువురు వీఆర్‌ఏలు రెవెన్యూ శాఖలోనే కొనసాగేందుకు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూ పైరవీలకు తెరతీశారు.

31న మంద కృష్ణ రాక

మునగాల: మండలంలోని గణపవరంలో ఇటీవల ఏర్పాటు చేసిన డా.బిఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాల ఆవిష్కరణకు ఈనెల 31న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, భరత్ భూషణ్, ఓయూ ప్రొఫెసర్ ఖాసీం రానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

ఉమ్మడి కుటుంబాలకు ఉపాధి దూరం

- ఒక కుటుంబానికి ఒకే జాబ్‌కార్డు
- ఎంతమంది సభ్యులున్నా వంద రోజులే పని
- మూడు నాలుగు వారాల్లోనే పనిదినాలు పూర్తి
- మిగతా రోజుల్లో ఖాళీగా ఉంటున్న కూలీలు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

జాబ్‌కార్డులు	2,61,093
నమోదై ఉన్న సభ్యులు	5,79,003
యాక్టివ్‌లో ఉన్న కార్డులు	1,82,777
సభ్యులు	3,46,987
ఈ సంవత్సరం పనిదినాల లక్ష్యం	28, 14,629
ఇప్పటి వరకు కల్పించిన పనిదినాలు	15,78,322
పూర్తయిన పనులు	56 శాతం

చిలుకూరు: ఉమ్మడి కుటుంబాలతో పాటు ఎక్కువ మంది సభ్యులున్న కుటుంబంలోని వారంతా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు నోచుకోవడం లేదు. ఒక కుటుంబంలో ఎంత మంది సభ్యులున్నా ఒకటే జాబ్‌కార్డు ఇవ్వడం.. ఒక కార్డుకు వంద రోజులే పని కల్పిస్తుండడంతో పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. గతంలో ఉమ్మడి కుటుంబంగా ఉండి వివాహం అనంతరం వేరుగా ఉంటున్నామని కొత్తగా జాబ్‌కార్డు ఇవ్వాలని వేడుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

ఈ సారి 2వేల వరకు ఉమ్మడి కుటుంబాలు..

జిల్లాలో 23 మండలాల పరిధిలో 475 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 2,61,093 జాబ్‌కార్డులు ఉండగా 5,79,003 కూలీలు నమోదై ఉన్నారు. వేసవి దృష్ట్యా నిత్యం ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య భారీగా పెరిగింది. రోజుకు సగటున 85 వేల నుంచి 95 వేల మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఒక జాబ్‌కార్డులో ఎక్కువ మంది సభ్యులున్న పక్షంలో వారందరినీ ఒకే జాబ్ కార్డుగా పరిగణించి వంద రోజులే పనిదినాల లక్ష్యంగా హాజరు వేస్తున్నారు. దీంతో మూడు నుంచి నాలుగు వారాల్లోనే పనిదినాలు పూర్తవుతున్నాయి. ఆ తర్వాత వారంతా పనులు లేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. 100 రోజులు పూర్తయిన ఉమ్మడి కుటుంబ జాబ్‌కార్డులు గతేడాది 3 వేలు ఉన్నాయి. అంతకుముందు 6 వేల వరకు ఉన్నాయి. ఈ ఏడాది కూడా కనీసం 2 వేల వరకు ఉమ్మడి కుటుంబాలు ఉపాధి కోల్పోవచ్చని అధికారులే అంటున్నారు.

కార్డుల జారీలో జాప్యం

వివాహమైనవారు ఉమ్మడి కుటుంబం నుంచి వేరై కొత్త జాబ్‌కార్డు పొందాలంటే.. ఆ కార్డు జిరాక్స్‌తో పాటు ఆధార్, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లను పంచాయతీ కార్యదర్శికి అందజేయాలి. వారు పరిశీలించి ఏపీఓకు పంపించాలి. అక్కడ నుంచి ఎంసీసీ(మ ండల కంప్యూటర్ సెంటర్) ద్వారా జిల్లా గ్రా మీణాభివృద్ధి సంస్థకు వెళ్తుతుంది. చివరకు జిల్లా సమన్వయకర్త కలెక్టర్ లాగిన్‌కు చేరుతుంది. ఆ తరు వాత పరిశీలించి జాబ్‌కార్డు మంజూరు చేస్తారు. ఇదంతా జరగడానికి సమయం పడుతుండడంతో కూలీలు పనులకు దూరం కావాల్సి వస్తోంది.

ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలి



సంఘీభావ ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్: ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఇందిరాపార్కు వద్ద చేపట్టిన దీక్షకు మద్దతుగా శనివారం జిల్లా కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిది సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు, ఐదు సంవత్సరాలుగా బదిలీలు లేవన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.నాగమణి, శ్రీనివాస్‌రెడ్డి, జె.యాకయ్య, వెంకటయ్య, ఎస్‌కె.సయ్యద్, వీరారెడ్డి, పాపిరెడ్డి, ఆడమ్, అనిల్‌కుమార్, శ్రీను, లింగయ్య, రమేష్, సీనయ్య, సైదా, అంజయ్య, ఆనంద్‌కిశోర్ పాల్గొన్నారు.

30 నుంచి ఇంటింటికీ బీజేపీ

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వరరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): నరేంద్ర మోదీ ప్రధానిగా తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఈ నెల 30వ తేదీ నుంచి జూన్ 30 వరకు సూర్యాపేట నియోజకవర్గంలో ఇంటింటికీ బీజేపీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పట్టణ, మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అసంఘటిత కార్మికుల కోసం రూ. 2లక్షల ఉచిత ప్రమాద బీమాను కేంద్ర ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. నిరుపేదలకు ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకంలో భాగంగా ఉచితంగా గ్యాస్ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, పట్టణ అధ్యక్షుడు ఎండీ అబీద్, పార్లమెంట్ కో కన్వీనర్ తుక్కని మన్మథ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గజ్జల వెంకటరెడ్డి, చలమల నరసింహ, జిల్లా అధికార ప్రతినిధి అయితగాని జానయ్య గౌడ్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు వల్దాసు ఉపేందర్, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మీరు అక్బర్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆరూరి శివ, జిల్లా నాయకులు మద్దిబోయిన శ్రీనివాస్, దాసరి వెంకన్న యాదవ్, పంతంగి సాలయ్య, రామారావు, శంకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణాలు దగ్ధం

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో శనివారం తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్‌తో పలు కూరగాయల దుకాణాలు దగ్ధమయ్యాయి. స్థానిక మార్కెట్ లో పాత గ్రామపంచాయతీ కార్యాలయం ముందు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ కింది భాగంలో ఉన్న రిటైల్ దుకాణాల్లో తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్ జరిగింది. దీంతో సర్వీస్‌రోడ్డు నుంచి వరుసగా ఉన్న పాశం సావిత్రమ్మ, తిరుపతమ్మ, అంజయ్య, పెద్దఅండాలుకు చెందిన దుకాణాల్లో మంటల చెలరేగాయి. స్థానికులు గమనించి అగ్నిమాపకశాఖకు సమాచారం ఇచ్చారు. వెంటనే వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పడంతో ఇతర దుకాణాలకు ముప్పు తప్పింది. తమకు తీవ్ర నష్టం జరిగిందని దుకాణ యజమానులు బోరున విలపించారు. ఆదుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు కావాలని నిప్పంటించి ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వడదెబ్బతో కూలీ మృతి

తుంగతుర్తి: వడదెబ్బతో ఉపాధి కూలీ మృతిచెందాడు. ఈ ఘటన వెంపటి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన కొండ వీరస్వామి (75) ఉదయం గ్రామంలోని అవుసలోని కుంటలో ఉపాధి పనులకు వెళ్లి తిరిగి వస్తూ మార్గమధ్యలో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో తోటి కూలీలు మంచినీళ్లు తాపించి, ప్రథమ చికిత్స అందిస్తుండగానే మృతిచెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

యాదాద్రిలో ప్రముఖుల పూజలు



శ్రీహయగ్రీవ స్వామి వారి ఆలయంలో కుటుంబ సభ్యులతో సంపూర్ణేష్‌బాబు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామిని జార్ఖండ్ డీజీ రవిశంకర్, డీఈజీ విజయలక్ష్మి, బిహార్ ఏసీబీ డీజీ ప్రేమలత, నాగాలాండ్ ఐజీ రూప, సిమ్లా ఎస్ఐబీ డీఐజీ అమొంగ్ల, సినీ నటుడు సంపూర్ణేష్‌బాబు కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ పర్యవేక్షకుడు ఊడెపు రాజు లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం సంపూర్ణేష్‌బాబు కుటుంబ సభ్యులు యాదగిరిపల్లి సమీపంలోని శ్రీలక్ష్మీ హయగ్రీవ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి నిత్యం శ్రీలక్ష్మీహయగ్రీవ స్వామి ఆరాధన, గో సేవ చేస్తూ సనాతన ధర్మాన్ని పాటిస్తుండటం గొప్ప విషయమని పేర్కొన్నారు.

మోతె ఎస్ఐని సస్పెండ్ చేయాలి



మోతె పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

- సీపీఎం నాయకురాలు మల్లు లక్ష్మి డిమాండ్
- పార్టీ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన

మోతె : పేదల పక్షాన శాంతియుతంగా పోరాడుతున్న సీపీఎం నాయకులు, మహిళా కార్యకర్తలపై దాడి చేసిన మోతె ఎస్ఐ మహేష్‌ను సస్పెండ్ చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. దాడిని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌తో పాటు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఆందోళనలో ఆమె పాల్గొని మాట్లాడారు. మోతె మండల పరిధిలోని విభళాపురం, అప్పన్నగూడెం గ్రామాల్లో డబుల్ బెడ్రూం ఇళ్లను అనర్హులకు కేటాయించారని ఆరోపించారు. పేదలకు న్యాయం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. అర్హులకు న్యాయం చేయాలని కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు, మండల కార్యదర్శి ముల్కూర్ గోపాల్‌రెడ్డితో పాటు మహిళా కార్యకర్తలపై మోతె ఎస్ఐ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు దాడులు చేయడం ఎంత వరకు సబబు అని ఆమె ప్రశ్నించారు. న్యాయం చేయాలని పేదలు ఆందోళన చేస్తున్నా కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కేసులకు భయపడేది లేదని, పేదలకు న్యాయం జరిగేంత వరకు సీపీఎం పోరాడుతుందని స్పష్టం చేశారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ సూరయ్యకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొలిశెట్టి యాదగిరిరావు, ముల్కలపల్లి రాములు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, నాగం మల్లయ్య, కిన్నెర పోతయ్య, కుంచం గోపి, వెలుగు మధు, సోమగాని మల్లయ్య, పెరుమళ్ల నాగమణి, కల్లెపల్లి సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

- అపార్ట్‌మెంట్ పైనుంచి పడడంతో మృత్యువాత
- మృతురాలు మిర్యాలగూడలోని సుందర్‌నగర్‌కు చెందిన శోభగా గుర్తింపు
- కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు



శోభ మృతదేహం

మిర్యాలగూడ అర్బన్: అనుమానాస్పద స్థితిలో యువతి మృతిచెందింది. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నాగార్జుననగర్‌లో గల వైష్ణవి అపార్టుమెంట్‌పై నుంచి ఓ యువతి పడడంతో స్థానికులు గుర్తించి ఆమెను ఏరియా ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. ఏరియా ఆస్పత్రికి చేరుకున్న వన్‌టౌన్ పోలీసులు యువతి ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. సదరు యువతి పట్టణంలోని సుందర్‌నగర్‌కు చెందిన శోభగా గుర్తించారు. చికిత్స అందిస్తుడగానే యువతి మృతిచెందింది. దీంతో డీఎస్పీ వెంకటగిరి ఏరియా ఆస్పత్రికి చేరుకుని యువతి మృతదేహాన్ని పరిశీలించారు. యువతి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన పోలీసులు తెలిపారు.

అనుమానాలెన్నో..

శోభ మృతిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అపార్ట్‌మెంట్ మెత్తం సీసీ పుటేజీ నిఘాలో ఉండటంతో పాటు నిత్యం వాచ్‌మన్ డ్యూటీలోనే ఉంటాడు. కొత్తవారు ఎవరు వచ్చినా లోనికి వెళ్లే పరిస్థితి ఉండదు. కాగా మృతురాలు శోభ గతంలో ఓ ఆస్పత్రిలో నర్సుగా పని చేసిందని సమాచారం. ఆ యువతి అపార్ట్‌మెంట్‌కు ఎందుకు వెళ్లింది?, అపార్ట్‌మెంట్ పైనుంచి ప్రమాదవశాత్తు పడిందా..? లేదా ఎవరైనా కావాలని తోశారా..? అనే విషయం తెలియాల్సి ఉంది. పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలిస్తే యువతి మృతిపై మిస్టరీ వీడనుంది.

చౌటుప్పల్‌లో వ్యక్తి..



బత్తుల నరేందర్ మృతదేహం

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని 9వ వార్డు పరిధి చిన్నకొండూర్ రోడ్డులో శనివారం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బత్తుల యాదగిరి–రాజమణి దంపతులకు ముగ్గురు కుమారులు. వారిలో చిన్నకుమారుడైన బత్తుల నరేందర్(38) చేనేత వృత్తితోపాటు గ్లాస్ ఫిటింగ్, ప్లై ఉడ్ వర్క్ చేస్తుంటాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన అతను పట్టణంలోని తంగడపల్లి రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన స్నేహితుడికి సంబంధించిన వివాహానికి హాజరైనట్టుగా తెలిసింది. మధ్యాహ్నం తర్వాత ఇంటికి చేరుకున్నాడు. ఆ సమయంలో ఇంటి ఆవరణలో చేనేత పని చేసుకుంటున్న తల్లి అతన్ని చూసింది. ఎక్కడికి వెళ్లి వస్తున్నావు, భోజనం చేశావా అని అడిగింది. తాను భోజనం చేశానని చెప్పి ఇంట్లోకి వెళ్లి ప్యాంటు, షర్టు విప్పేసి షాట్ ధరించి బెడ్రూంలో పడుకున్నాడు. ఆ క్రమంలో లోపలికి వెళ్లిన వ్యక్తి చాలాపేపటి వరకు కూడా బయటకు రాకపోవడంతో వదిన సత్యలక్ష్మి రాత్రి 7గంటల ప్రాంతంలో బెడ్రూంలోపలికి వెళ్లి చూసింది. అప్పటికే కదలికలు లేకపోవడంతో కుటుంబ సభ్యులను పిలిచింది. వారంతా పరిశీలించగా చనిపోయినట్టుగా నిర్ధారించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సైదులు ఘటనా స్థలానికి వెళ్లి ఇంటిని పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు. శరీరంపై పలు చోట్ల గాయాలు ఉండడంతో ఎవరైనా కొట్టడంతో ఇలా జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక తర్వాత వాస్తవాలు తెలుస్తాయని ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

దేవరకొండ: గుర్రంపోడు మండలం కొప్పోల్ గ్రామంలో ఇటీవల జరిగిన యువకుడి హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. కొప్పోల్ గ్రామానికి చెందిన ఆవుల మల్లయ్య కుమార్తె నల్లగొండలో చదువుతున్న క్రమంలో కట్టంగూర్ మండలం దుగినేపల్లికి చెందిన బొడ్డు సంతోష్(18)తో పరిచయం ఏర్పడి అదికాస్తా ప్రేమగా మారింది. వీరి ప్రేమ విషయం తెలుసుకున్న అమ్మాయి తల్లిదండ్రులు మూడు నెలల క్రితం షీ టీం పోలీసులకు ఫిర్యాదు చేసి కౌన్సిలింగ్ ఇప్పించారు. వారిలో మార్పు రాకపోవడంతో పాటు వారిరువురు ఫోన్‌లో తరుచూ మాట్లాడుకుంటున్నారు.ఈ క్రమంలోనే ఈనెల 25న సంతోష్ అమ్మాయి స్వగ్రామమైన కొప్పోల్‌కు వచ్చాడు. ఎవరూ లేని సమయంలో అమ్మాయి ఇంట్లోకి వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కూలికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చిన అమ్మాయి తండ్రి మల్లయ్య వారిని చూసి కోపోద్రిక్తుడయ్యాడు. వెంటనే తమ సమీప బంధువైన ఆవుల నగేష్‌తో పాటు తన తల్లి రాములమ్మను పిలిచి రోకలి బండలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన సంతోష్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో కొండమల్లేపల్లి సిఐ శ్రీనివాసులు,ఎస్ఐ శివప్రసాద్,తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

స్టడీ సెంటర్ యువతకు ఉపయోగం



స్టడీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎంపీ, ఎమ్మెల్యేలు

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ : జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టడీ సెంటర్ నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. మహిళా ప్రాంగణంలోని డీపీఆర్‌సీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్టడీ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అధ్యయన కేంద్రంగా సెంటర్‌ను తీర్చిదిద్దాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థులకు అన్ని రకాల పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. అభ్యర్థులకు కోచింగ్‌ల ఖర్చుభారం తగ్గించాలన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయిల్లో గ్రంథాలయాలను విస్తరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, రవీంద్రకుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, నోముల భగత్, జెడ్పీ వైస్ చైర్మన్ ఇగిరి పెద్దులు, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



బాలుర విభాగంలో మొదటి బహుమతి అందుకుంటున్న మేడ్చల్ మల్కాజిగిరి జట్టు

- ముగిసిన రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ యూత్‌చాంపియన్ షిప్ పోటీలు
- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ఎంపీ బడుగుల



బాలికల విభాగంలో రెండో బహుమతి అందుకుంటున్న అందుకుంటున్న ములుగు జట్టు

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని రాజ్యసబ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. క్రీడాకారులు అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ తమలోని ప్రతిభను మెరుగుపరుచుకొని రాష్ట్ర , జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. గతంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడంతో పాటు ప్రస్తుతం రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించిన ఘనత రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డిదేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ సీఈవో సురేష్, క్రీడల అధికారి వెంకట్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకుడు వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ భిక్షం, ఆజంబాబు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలుగా ఆయా జిల్లాల జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో మొదటి బహుమతి మేడ్చల్ మల్కాజిగిరి, ద్వితీయ బహుమతి ములుగు, బాలుర విభాగంలో మొదటి బహుమతి మేడ్చల్ మల్కాజిగిరి, ద్వితీయ బహుమతి వికారాబాద్ జిల్లాలు కైవసం చేసుకున్నారు.

రిజర్వ్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

- ఎల్‌డీఎం ప్రోగ్రాం రాష్ట్ర చైర్మన్ నాగరిగారి ప్రీతమ్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రీతమ్, వెంకన్న

తిరుమలగిరి (తుంగతుర్తి) : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 31 ఎస్సీ, ఎస్టీ రిజర్వ్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా లీడర్ షిప్ డెవలప్‌మెంట్ మిషన్ (ఎల్‌డీఎం)ను అధిష్టానం ఏర్పాటు చేసిందని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎల్‌డీఎం ప్రోగ్రాం రాష్ట్ర చైర్మన్ నాగరిగారి ప్రీతమ్, సూర్యాపేట డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ తెలిపారు. తిరుమలగిరిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తుంగతుర్తి నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో ఎల్‌డీఎం ప్రోగ్రాంపై శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్సేనని అన్నారు. దళిత నియోజకవర్గాల్లో పార్టీని విస్తతం చేయడం ముఖ్య ఉద్దేశమని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులను సమన్వయం చేసి పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. .సమావేశంలో తుంగతుర్తి నియోజకవర్గ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి బాల లక్ష్మి, నియోజకవర్గ ఇన్‌చార్జి గుడిపాటి నర్సయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు అనురాధ, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ అమరవరపు శ్రీనివాస్, మైనార్టీ సెల్ చైర్మన్ నిజామొద్దీన్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, సీనియర్ నాయకులు అన్నెపర్తి జ్ఞానసుందర్, ఇటికాల చిరంజీవి, బ్లాక్ కాంగ్రెస్ , మండలాల పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కమ్యూనిస్టులతోనే సాధ్యం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



వెంకట్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న తమ్మినేని వీరభద్రం తదితరులు

హుజూర్‌నగర్ : దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కమ్యూనిస్టులతోనే సాధ్యమవుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. పార్టీ సీనియర్ కార్యకర్త పులిచింతల వెంకట్‌రెడ్డి ఆకస్మికంగా మృతిచెందడంతో కుటుంబ సభ్యులు శనివారం హుజూర్‌నగర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. అంతిమయాత్రలో తమ్మినేని వీరభద్రం పాల్గొని వెంకట్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకట్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. దేశంలో కాలానుగుణంగా మారుతున్న పరిస్థితుల నడుమ తాత్కాలికంగా కొంతమేర బలహీనపడ్డ చివరకు ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసేది కమ్యూనిస్టులేనని ఆయన పేర్కొన్నారు. కార్యమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, రాష్ట్ర నాయకులు నంద్యాల నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, నాయకులు ఎస్ పాండు, ఎన్.వెంకటేశ్వర్లు, కె.యాదగిరిరావు, పి.వెంకటరెడ్డి, డి.బ్రహ్మం, వి.సైదులు, యాకోబ్, రవి, శ్రీరాములు, పి.శేఖర్‌రావు, హుస్సేన్, శీలం శ్రీను, త్రివేణి పాల్గొన్నారు.

అఖిలపక్ష నాయకుల సంతాపం

పట్టణానికి చెందిన బీఆర్ఎస్, సీపీఐ, న్యూడెమోక్రసీ, టీడీపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు అఖిల పక్ష నాయకులు వెంకటరెడ్డి అంతిమ యాత్రలో పాల్గొని సంతాపం తెలిపారు. వారిలో సీపీఐ రాష్ట్ర నాయకులు పశ్యపద్మ, యల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, కొప్పోజు సూర్యనారాయణ, ఒక్కవంతుల కోటేశ్వరరావు, యలక వెంకటేశ్వర్లు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎన్జీ కళాశాలలో కొత్తగా డిగ్రీ కోర్సులు



హెల్ప్‌లైన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న 'దోస్త్' కోఆర్డినేటర్ డాక్టర్ అంతటి శ్రీనివాసులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని ఎన్జీ కళాశాల నందు 2023–24 విద్యా సంవత్సరానికి కొత్తగా బీఎస్సీ హానర్స్ కంప్యూటర్ సైన్స్, బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (బీసీఏ) కోర్సులు ప్రవేశపెట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ అంతటి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్జీ కళాశాలలో 1620 సీట్లు ఉండగా అందులో బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 360, లైఫ్ సైన్స్‌లో 360, బీకాం కంప్యూటర్స్ అప్లికేషన్స్ అండ్ టాక్సేషన్స్‌లో 420, బీఏ 240, బీబీఏలో 120, బీఎస్సీ హానర్స్ కంప్యూటర్ సైన్స్‌లో 60, బీసీఏలో 60 సీట్లు ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు www.dost.cgg.gov.in వెబ్‌సైట్ నందు దరఖాస్తు రిజిస్ట్రేషన్ చేసుకొని, కోర్సులకు వెబ్ ఆప్షన్ ఇవ్వాలన్నారు.

హెల్ప్‌లైన్ సెంటర్ ప్రారంభం

దోస్త్ 2023 అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా ఎన్జీ కళాశాల నందు శనివారం హెల్ప్‌లైన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా 'దోస్త్' కోఆర్డి నేటర్ డాక్టర్ అంతటి శ్రీనివాసులు మాట్లాడుతూ దోస్త్ రిజిస్ట్రేసన్ నందు విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే ఎన్జీ కాలేజీలోని హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించాలన్నారు. హెల్ప్‌లైన్ సెంటర్ సిబ్బంది వారి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

చౌటుప్పల్ : ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని చింతలగూడెం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని ఈస్ట్‌మిడ్నాపూర్ ప్రాంతంలోని కోట్లాపురి గ్రామానికి చెందిన బుధదేబ్‌రే(21) గత నెల రోజుల క్రితం తన బావ శ్యాంసుందర్ పుట్టుమైతీతో కలిసి చౌటుప్పల్‌లో 132కెవీ విద్యుత్ లైన్ పనులు చేసేందుకు వచ్చారు. అందులో భాగంగా రోజువారీ మాదిరిగానే మండలంలోని చింతలగూడెం శివారులో జరుగుతున్న పనికి వెళ్లాడు. సాయంత్రం పని ముగిసాక తన బావతో కలిసి అదే గ్రామంలో ఉన్న తన గదికి చేరుకున్నాడు.భోజనం చేశాక రాత్రి 10గంటలకు చింతలగూడెంలోని తన సైట్‌కు నైట్ వాచ్ డ్యూటీ కోసం మరో యువకుడైన సందీప్‌మైతీతో కలిసి వెళ్లాడు. బుధదేబ్‌రే అర్ధరాత్రి సమయంలో ఫోన్‌లో మాట్లాడుతుండగా మరో యువకుడు నిద్రపోయాడు. ఆ క్రమంలో తెల్లవారుజామున తన గది సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధదేబ్‌రే ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నాడని, ప్రేమ కారణాలతోనే మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు మృతుడి బావ శ్యాంసుందర్ పుట్టుమైతీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సైదులు తెలిపారు.

గరిష్ట నీటిమట్టానికి అడుగు దూరంలో..



నీటితో కళకళలాడుతున్న మూసీ రిజర్వాయర్

- నిండుకుండలా మూసీ ప్రాజెక్టు

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టానికి కేవలం ఒకే ఒక దూరంలో ఉంది. హైదరాబాద్ నగరంతో పాటు మూసీ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నెల రోజుల నుంచి మూసీలోకి ఇన్‌ఫ్లో వస్తుండటంతో నీటిమట్టం ఒక్కో అడుగు పెరుగుతూ వస్తోంది శనివారం ఎగువ నుండి మూసీకి 680 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మూసీ పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా శనివారం సాంత్రానికి 643.50 అడుగులకు చేరుకుందని అధికారులు పేర్కొన్నారు. కేవలం మరో అడుగు నీరు చేరితే ప్రాజెక్టు గేట్లు పైకెత్తే అవకాశముంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.02 టీఎంసీల నీరు నిల్వ ఉంది.